

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా

సంపుటి : 7 సంచిక : 289 సోమవారం 21-09-2026 ఎడిటర్ : బరిగెల శివ ■ పేజీలు : 4 ■ వెల : 5.00

పబ్లిషర్స్ : తెలంగాణ హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూర్, తమిళనాడు చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్










# భక్తి పేరుతో డీజే.. హంగామా..?

## వినాయకుడి ఉత్సవాలా..శబ్ద కాలుష్య ఉత్సవాలా?



డాక్టర్ బరిగెల శివ

**హైదరాబాద్(జై భీమ్ డెస్క్)**

రాష్ట్రవ్యాప్తంగా వేలాది వినాయక మండపాలు.. ఒక్కో ప్రాంతంలో వరుసగా డీజేలు.. రోడ్ల నిర్బంధం.. భారీ శబ్దాలు.. ప్రజల ఆరోగ్యం, ప్రశాంతత, అత్యవసర రాకపోకలపై పెరుగుతున్న ఆందోళన.. నిబంధనలు ఉన్నా అమలు ఎక్కడ?వినాయక నవరాత్రి ఉత్సవాలు అంటే భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయం. విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తూ సమాజంలో ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వం పెంచుకోవాల్సిన సందర్భం. కానీ కొన్ని ప్రాంతాల్లో ఉత్సవాల రూపం మారుతోందన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది. భక్తి కంటే డీజే శబ్దం.. ఆధ్యాత్మికత కంటే హంగామా.. ఉత్సవం కంటే శబ్ద పోటీ కనిపిస్తోందని పలువురు ప్రశ్నిస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా వేలాది వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించే సమయంలో ఒక్కో ప్రాంతంలో అనేక మండపాలు ఏర్పాటు అవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఒకే చోట పలు డీజేలు ఏర్పాటు చేసి భారీ శబ్దాలతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఒకరి డీజే కంటే మరొకరి డీజే ఎక్కువ శబ్దంతో ఉండాలనే పోటీ పెరిగితే.. చివరికి ఆ శబ్దాన్ని భరించాల్సింది మాత్రం సాధారణ ప్రజలేనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వినాయకుడి ముందు భక్తి గీతాలు, భజనలు, సంప్రదాయ కార్యక్రమాలు జరగాల్సిన చోట.. చెవులు మోగిపోయే స్థాయిలో డీజే శబ్దాలు ఎందుకు? అనే ప్రశ్న ఇప్పుడు సమాజం ముందుంది.వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు, విద్యార్థులు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు భారీ శబ్దాలతో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. శబ్ద కాలుష్యానికి సంబంధించిన నిబంధనలు అమలులో ఉన్నప్పుడు.. వాటిని ఎవరు పర్యవేక్షిస్తున్నారు? అనుమతులు ఉంటే వాటి పరిమితులు ఏమిటి? అనుమతులు లేకుండా నిర్వహిస్తే చర్యలు ఎందుకు ఉండకూడదు? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

**రోడ్లు నిర్బంధిస్తే.. అత్యవసర సమయంలో పరిస్థితి ఏమిటి?**

వినాయక ఊరేగింపుల సమయంలో రహదారులపై భారీ జనసమ్మర్ధం ఏర్పడటం, వాహనాల రాకపోకలకు ఆటంకం కలగడం వంటి సమస్యలు కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. అయితే ఒక అత్యవసర పరిస్థితిని ఊహించండి.

- ఒక అంబులెన్స్ ఆసుపత్రికి వెళ్లాలి.
- ఒక రోగిని అత్యవసరంగా తరలించాలి.
- ఒక ఫైర్ ఇంజిన్ సంఘటనా స్థలానికి చేరుకోవాలి.

**ఆ సమయంలో రహదారి నిర్బంధంగా ఉంటే బాధ్యత ఎవరిది?**

పండుగ జరుపుకోవడం హక్కే. కానీ ప్రజా రహదారులు అందరివి. అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేయడం నిర్వాహకులు, అధికారులు, పోలీసుల సమిష్టి బాధ్యత.

**డీజే శబ్దం పెంచడమే భక్తికి కొలమానమా?**

వినాయకుడిపై భక్తిని చాటుకోవడానికి భారీ డీజేలు తప్పనిసరి కావు. డీజే లేకుండా భక్తి ఉండదా? భజనలు చేయలేమా? సంప్రదాయ సంగీతంతో ఉత్సవాలు నిర్వహించలేమా?భక్తి మనసులో ఉండాలి.. డీజే సౌండ్‌లో కాదు.వినాయకుడిని విఘ్నేశ్వరుడిగా పూజిస్తున్నాం. ఆయన పేరుతోనే ఇతరుల జీవనానికి విఘ్నాలు సృష్టించడం ఎంతవరకు సమంజసం?

**రోగికి ఇబ్బంది కలిగితే అది విఘ్నమే.**

అంబులెన్స్ ఆగిపోతే అది విఘ్నమే, విద్యార్థి చదువుకు ఆటంకం కలిగితే అది విఘ్నమే, వృద్ధుడి ప్రశాంతతకు భంగం కలిగితే అది కూడా విఘ్నమే, విఘ్నాలను తొలగించే వినాయకుడి పేరుతో మనమే విఘ్నాలు సృష్టించకూడదని సమాజం ఆలోచించాల్సిన సమయం వచ్చింది.

**కాలుష్యం గాలి ద్వారా మాత్రమే కాదు.. శబ్దం ద్వారా కూడా!**

పండుగ అంటే పర్యావరణాన్ని మర్చిపోవడం కాదు. డీజే వాహనాలు, జనరేటర్లు, భారీ వాహనాల రాకపోకలు, జనసమ్మర్ధం వంటి అంశాలు స్థానికంగా కాలుష్యాన్ని పెంచే పరిస్థితులకు దారితీయవచ్చు.శబ్ద కాలుష్యం కనిపించదు.. కానీ దాని ప్రభావం ప్రజలపై ఉండవచ్చు.అందుకే పండుగల సమయంలో ఉత్సవాలను ఆపాలని కాదు.. నిబంధనల పరిధిలో, ప్రజలకు ఇబ్బంది కలగకుండా, పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్వహించాలన్నదే ప్రజల డిమాండ్.

**వ్యవస్థ మొత్తం అప్రమత్తం కావాల్సిన సమయం**

ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే.. ప్రమాదం జరగకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలి.

డీజే అనుమతులు ఉన్నాయా?, శబ్ద పరిమితులు పాటిస్తున్నారా?, సమయ పరిమితులు అమలవుతున్నాయా?, ట్రాఫిక్‌కు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయా?, అత్యవసర వాహనాలకు మార్గం ఖాళీగా ఉంచుతున్నారా?, ప్రజలకు ఇబ్బంది కలిగితే ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందిస్తున్నారా? ఈ ప్రశ్నలకు వ్యవస్థ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో డీజే శబ్దం వల్లే ఎవరో మరణించారని వైద్యపరమైన నిర్ధారణ లేకుండా చెప్పడం సరికాదు. కానీ భారీ శబ్దాలు, జనసమ్మర్ధం, రహదారి నిర్బంధం వంటి అంశాలు ప్రమాదాలకు దారితీయకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మాత్రం అత్యంత అవసరం.

**జై భీమ్ న్యూస్ ప్రశ్నిస్తోంది..**

'వినాయకుడికి భక్తి కావాలా? లేక డీజే శబ్దం కావాలా?"

పండుగ మన హక్కు..ప్రజల ప్రశాంతత కూడా వారి హక్కే.

ఉత్సవం జరుపుకుందాం.. కానీ నిబంధనలతో.

భక్తిని చాటుకుందాం.. కానీ ఇతరులకు ఇబ్బంది కలగకుండా.

వినాయకుడిని పూజిద్దాం.. కానీ ఆయన పేరుతో ప్రజలకు విఘ్నాలు సృష్టించకుండా.

**భక్తి పెరగాలి.. డీజే హంగామా కాదు!**

ఉత్సవం ఉండాలి.. ప్రజల ఇబ్బంది కాదు!

వినాయకుడి పండుగ ఆనందాన్ని పంచాలి.. ఆందోళనను కాదు!

---



## ఎంజీఎం ఆసుపత్రిలో స్లాబ్ పెచ్చులు ఊడి ముగ్గురికి గాయాలు

**వరంగల్, 20 సెప్టెంబర్, (జై భీమ్ న్యూస్)**

వరంగల్‌లోని ఎంజీఎం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రమాదం చోటుచేసుకుంది. ఆసుపత్రిలోని ఆరోగ్యశ్రీ వార్డులో స్లాబ్ పైకప్పు పెచ్చులు ఒక్కసారిగా ఊడిపడటంతో చికిత్స పొందుతున్న ఓ రోగితో పాటు ఇద్దరు అటెండర్లకు గాయాలయ్యాయి. పెరాలసిస్ వ్యాధితో చికిత్స పొందుతున్న మస్తాన్ (55)పై స్లాబ్ పెచ్చులు పడటంతో గాయాలయ్యాయి. అలాగే ఆయనకు సహాయంగా ఉన్న అటెండర్లు ఎల్లమ్మ (50), ఓంకార్ (33)లకు కూడా గాయాలైనట్లు సమాచారం. ప్రమాదాన్ని గమనించిన ఆసుపత్రి సిబ్బంది వెంటనే స్పందించి గాయపడిన వారిని వైద్యుల వద్దకు తరలించారు. వైద్యులు వారికి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. ఆసుపత్రి భవనంలో స్లాబ్ పెచ్చులు ఊడిపడటంతో రోగులు, అటెండర్లలో ఆందోళన నెలకొంది. పాత భవనాల పరిస్థితిని పరిశీలించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

---

## సీనియారిటీకి విలువ లేదా..

# ప్రతి పోస్టుకు ఓ రేటా?




- 'రాజీ' ని క్కచ్చిగా ఎవరితో ఎవరికి కుదిరింది?
- బల్దియాలో జూనియర్లకు పెద్దపీట..?
- సిడిఎంఏ డాక్టర్ శ్రీదేవి నీ కలవనున్న ఉద్యోగులు

**వరంగల్, 20 సెప్టెంబర్, (జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇన్‌చార్జి బాధ్యతల కేటాయింపుపై ఉద్యోగుల్లో చర్చ సాగుతోంది. సీనియారిటీ, అర్హత, అనుభవం, పనితీరు, నిబంధనలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకున్నారా..? ఏ నిబంధనల ఆధారంగా బాధ్యతలు అప్పగించారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న పలువురిని కాదని, తరువాత విధుల్లో చేరిన వారికి సూపరింటెండెంట్ స్థాయి బాధ్యతలు అప్పగించడంపై ఉద్యోగుల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. అనుభవం, పనితీరు, అర్హతలకు ప్రాధాన్యత ఇచ్చారా..? లేక వేరే కారణాలున్నాయా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.మరోవైపు, గతంలో ఆర్‌ఐగా పనిచేసిన సమయంలో పనితీరుపై అప్పటి కమిషనర్ అభ్యంతరం వ్యక్తం చేసి పక్కన పెట్టినట్లు, ఒకే సర్వే నంబర్‌కు రెండు ఇంటి నంబర్లు కేటాయించిన వ్యవహారంలోనూ ఉన్నతాధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు బల్దియాలో ప్రచారం ఉంది. అలాంటి నేపథ్యం ఉన్న వ్యక్తికి ప్రస్తుతం కీలక బాధ్యతలు అప్పగించడంపై అసలు ప్రాతిపదిక ఏమిటి? "రాజీ " నిక్కచ్చిగా ఎవరితో ఎవరికి కుదిరింది " అన్న ప్రశ్న తలెత్తుతోంది.

**ప్రతి పోస్టుకు ఓ రేటా..?**

పోస్టింగులు, పదోన్నతులు, ఇన్‌చార్జి బాధ్యతల విషయంలో "ప్రతి పోస్టుకు ఓ రేటు" ఉంటుందన్న ప్రచారం కూడా ఉద్యోగుల్లో చర్చకు వస్తోంది. అయితే దీనిపై ఎలాంటి అధికారిక నిర్ధారణ లేదు. ఈ ప్రచారంపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

**పదవి విరమణకు ముందైనా.. నిజాయితీకి చోటివరా!?**

కొందరు అధికారులు మాత్రం.. మిగతా 2లో

---

## బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా జి. కిరణ్ కుమార్ బాధ్యతల స్వీకరణ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 (జై భీమ్ న్యూస్)**



తెలంగాణకు చెందిన ప్రముఖ న్యాయవాది జి. కిరణ్ కుమార్ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) సభ్యుడిగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. న్యూఢిల్లీలో బీసీఐ చైర్మన్ మన్నన్ కుమార్ మిశ్రా సమక్షంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్‌కు పలువురు న్యాయవాదులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. విష్ణువర్ధన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. సిద్దిపేటలో జన్మించి, పెరిగిన జి. కిరణ్ కుమార్ గత 25 ఏళ్లకు పైగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి కోసం ఆయన గతంలోనూ పలు కార్యక్రమాల్లో చురుకుగా పనిచేశారు. మద్రాస్? కాదు, హైదరాబాద్‌లోని ఎంసీసీబీఏ నాంపల్లి విభాగంలో జనరల్ సెక్రటరీగా, అనంతరం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ న్యాయవాదుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేశారు. న్యాయవాదులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ కార్యక్రమాలు, వృత్తిపరమైన అవకాశాల మెరుగుదల వంటి అంశాలపై కిరణ్ కుమార్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రస్తుతం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో తెలంగాణలోని న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను జాతీయ స్థాయిలో బీసీఐ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. న్యాయవాదుల సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి, గౌరవం, రక్షణకు ప్రాధాన్యత ఇస్తానని కిరణ్ కుమార్ పేర్కొన్నారు. న్యాయవాదుల హక్కులు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను బలంగా వినిపిస్తూ, న్యాయవాద వృత్తి మరింత గౌరవప్రదంగా, సురక్షితంగా కొనసాగేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తెలంగాణ నుంచి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించడం పట్ల న్యాయవాద వర్గాల్లో అభినందనలు వ్యక్తమయ్యాయి.

# కేయూలో ఈసీ సభ్యుడిపై ఆరోపణల దుమారం!

- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా? పాలకమండలి నిర్ణయాలపై సమగ్ర విచారణకు డిమాండ్
- ఈసీ సభ్యుడి నియామక అర్హతల నుంచి భూ వ్యవహారాల వరకు విచారణ జరపాలంటున్న విద్యార్థి వర్గాలు
- విద్యార్థుల భద్రతపై తక్షణ చర్యలు తీసుకోవాలి.. వీసీ, రిజిస్ట్రార్ సమాధానం చెప్పాలని డిమాండ్







**వరంగల్, సెప్టెంబర్ 20 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలో ఈసీ సభ్యుడిగా కొనసాగుతున్న సురేష్ లాల్ వ్యవహారశైలిపై పలు విద్యార్థి వర్గాలు, సంబంధిత వర్గాలు తీవ్ర ఆరోపణలు, విమర్శలు వ్యక్తం చేస్తున్నాయి. విద్యార్థులకు సంబంధించిన అంశాల్లో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలతో పాటు, పాలకమండలి సమావేశాల్లో తీసుకున్నట్లు చెబుతున్న కొన్ని నిర్ణయాలపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పాలకమండలి సమావేశాల మినిట్స్, తీర్మానాలు, ఫైల్ నోటింగ్స్, విచారణ నివేదికలు, ప్రభుత్వ ఉత్తర్వులు తదితర రికార్డులను సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విద్యార్థి వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు, విద్యా హక్కులు, విశ్వవిద్యాలయంలో వారి సమస్యలకు సంబంధించిన అంశాల్లో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు. విద్యార్థులపై చర్యలు తీసుకున్నప్పుడు వాటికి ఆధారాలు ఏమిటి, ఎవరి సిఫారసుల మేరకు నిర్ణయం తీసుకున్నారు, విచారణ ఎవరు నిర్వహించారు, విచారణలో ఎలాంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు, సంబంధిత విద్యార్థులకు తమ వాదన వినిపించే అవకాశం కల్పించారా అనే అంశాలపై పూర్తి వివరాలను వెల్లడించాలని కోరుతున్నారు. ఈసీ సభ్యుడిగా సురేష్ లాల్ నియామకానికి సంబంధించిన అర్హతలు, నిబంధనలు, నియామక ప్రక్రియపైనా ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. సీనియర్ ఆచార్యుని హోదాలో ఈసీ సభ్యుడిగా నియమించడానికి ఏ నిబంధనలను ప్రాతిపదికగా తీసుకున్నారు, నియామక ఉత్తర్వులు ఏమిటి, అర్హతలను ఎవరు పరిశీలించారు అనే వివరాలను బహిర్గతం చేయాలని విద్యార్థి వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. నియామకం నిబంధనలకు అనుగుణంగా జరిగిందా లేదా అనే అంశంపై స్వతంత్రంగా విచారణ జరపాలని కోరుతున్నారు. అదేవిధంగా ఎన్ఎస్ఎస్‌కు సంబంధించిన గత వ్యవహారాల్లో ఏర్పాటు చేసినట్లు పేర్కొంటున్న విచారణ కమిటీ నివేదికను కూడా బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ కమిటీని ఎవరు ఏర్పాటు చేశారు, ఏ అంశాలపై విచారణ జరిగింది, కమిటీలో ఎవరెవరు ఉన్నారు, నివేదికలో ఏమి పేర్కొన్నారు, నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారు అనే వివరాలను విశ్వవిద్యాలయ అధికారులు వెల్లడించాలని కోరుతున్నారు. నివేదికలో అవకతవకలు ఉన్నట్లు విచారణలో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అంటున్నారు. మరోవైపు కేయూ పరిధిలోని పీజీ సెంటర్, కరీంనగర్‌కు సంబంధించిన 2013-14 కాలం నాటి భూ వ్యవహారాల్లో సురేష్ లాల్ పాత్రపై ఆరోపణలు ఉన్నాయని కొందరు పేర్కొంటున్నారు. భూ వ్యవహారాలకు సంబంధించి అప్పటి సర్వే నంబర్లు, భూ రికార్డులు, కేటాయింపులు, ప్రభుత్వ ఉత్తర్వులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఫైల్ నోటింగ్స్, సంబంధిత అధికారుల నిర్ణయాలను పరిశీలించాలని వారు కోరుతున్నారు. ఆరోపణల్లో వాస్తవం ఉంటే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే అధికారిక రికార్డులతో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నత విద్యా మండలి (టీజీ - సిహెచ్ఈ) నుంచి వచ్చినట్లు పేర్కొంటున్న ఉత్తర్వులు, తదనంతరం రూపొందినట్లు చెబుతున్న నివేదికలపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నత విద్యా మండలి అసలు ఉత్తర్వులు ఏమిటి, వాటి ఆధారంగా ఎలాంటి విచారణ జరిగింది, అనంతరం రూపొందించిన నివేదికలో మార్పులు జరిగాయా లేదా, నివేదిక తయారీలో ఎవరి పాత్ర ఉంది అనే అంశాలను రికార్డుల ఆధారంగా పరిశీలించాలని విద్యార్థి వర్గాలు కోరుతున్నాయి. అసలు ఉత్తర్వులు, విచారణ నివేదికలు, ఫైల్ నోటింగ్స్, అధికారుల అభిప్రాయాలను బహిర్గతం చేస్తే వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుందని పేర్కొంటున్నారు. విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతోందని, కొందరు విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని, విద్యార్థుల ఆత్మహత్యలకు దారితీసే పరిస్థితులు ఏర్పడుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. కొందరు విద్యార్థులు తమ సమస్యలకు సంబంధించి ఆత్మహత్య వాంగ్మూలాలు రాసుకున్నారనే ఆరోపణలు కూడా వస్తున్న నేపథ్యంలో ఈ అంశాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని విద్యార్థి వర్గాలు కోరుతున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక ఆధారాలు లేదా పోలీసు విచారణ వివరాలు అందుబాటులోకి రావాల్సి ఉంది. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ కౌన్సెలింగ్, ఫిర్యాదుల పరిష్కారం, అత్యవసర సహాయ వ్యవస్థలను బలోపేతం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. విశ్వవిద్యాలయ పరిపాలనా వ్యవహారాలపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. వీసీ ఛాంబర్‌లో కొందరు వ్యక్తులు తరచుగా ఉండి ఇతరులపై ఫిర్యాదులు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, అలాంటి ఫిర్యాదులను అధికారులు ఏ విధంగా పరిశీలిస్తున్నారు, ఫిర్యాదులకు ఆధారాలు ఏమిటి, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులకు వివరణ ఇచ్చే అవకాశం కల్పిస్తున్నారా అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. సురేష్ లాల్ వ్యవహారశైలిపై ప్రభుత్వం లేదా ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు కొందరు ఆరోపిస్తున్నప్పటికీ, అవి నిజంగా జారీ అయ్యాయా, విశ్వవిద్యాలయానికి చేరాయా, చేరితే వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు అనే విషయాలను కూడా అధికారికంగా వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత ఉత్తర్వులు ఉంటే వాటి ప్రతులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై కేయూ వీసీ, రిజిస్ట్రార్ బహిరంగంగా వివరణ ఇవ్వాలని విద్యార్థి వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. అవసరమైతే కేయూ సెనేట్ హాల్ వేదికగా సంబంధిత అధికారిక పత్రాలు, నిబంధనలు, విచారణ నివేదికల ఆధారంగా బహిరంగ చర్చ నిర్వహించాలని కోరుతున్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణలకు బదులుగా రికార్డుల ఆధారంగా వాస్తవాలను నిర్ధారించాలని వారు అంటున్నారు. ఇక విశ్వవిద్యాలయ వ్యవహారాలపై వార్తలు సేకరిస్తున్న జర్నలిస్టులను హెచ్చరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మీడియా ప్రతినిధులపై ఎవరైనా ఒత్తిడి లేదా బెదిరింపులకు పాల్పడ్డారా అనే అంశంపై కూడా విచారణ జరపాలని జర్నలిస్టు వర్గాలు కోరుతున్నాయి. ప్రజా ప్రయోజనానికి సంబంధించిన అంశాలను స్వేచ్ఛగా రిపోర్ట్ చేసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మొత్తంగా కేయూలో ఈసీ సభ్యుడి నియామక అర్హతలు, పాలకమండలి నిర్ణయాలు, విద్యార్థులపై తీసుకున్న చర్యలు, ఎన్ఎస్ఎస్ విచారణ కమిటీ, 2013--14 కాలం నాటి భూ వ్యవహారాలపై వచ్చిన ఆరోపణలు, ఉన్నత విద్యా మండలి ఉత్తర్వులు-నివేదికలు, విద్యార్థుల భద్రత, మీడియాపై బెదిరింపుల ఆరోపణలు తదితర అంశాలపై సమగ్ర విచారణ జరపాలనే డిమాండ్ పెరుగుతోంది.

విశ్వవిద్యాలయం ప్రతిష్టను కాపాడటంతో పాటు విద్యార్థుల భవిష్యత్తు, భద్రతను దృష్టిలో పెట్టుకుని ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతి అంశాన్ని స్వతంత్రంగా పరిశీలించాలని విద్యార్థి వర్గాలు కోరుతున్నాయి. ఆరోపణలు నిజమని విచారణలో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే అధికారిక పత్రాలతో స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశాలపై సురేష్ లాల్, కోలా శంకర్, కేయూ వీసీ, రిజిస్ట్రార్ తదితర సంబంధిత వ్యక్తుల అధికారిక వివరణలు వెలువడాల్సి ఉంది.

**జై భీమ్ న్యూస్ - వాస్తవాల వెలికితీతే లక్ష్యం**



## అంబేద్కర్‌ను 'కల్పిత నాయకుడు' అన్న వ్యాఖ్యలపై తీవ్ర నిరసన

- హమారా ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి : ఓటరికారి లక్ష్మీ రాజం
- అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం.. అన్ని పార్టీల నాయకుల సంఘీభావం

**రాజన్న సిరిసిల్ల జిల్లా,జై భీమ్ న్యూస్ :**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను 'కల్పిత నాయకుడు'గా పేర్కొంటూ హమారా ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు, ఆయన రచించినట్లు ప్రచారం అవుతున్న 'కల్పిత నాయకుడు' పుస్తకంపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే సిరిసిల్లతో పాటు పలు ప్రాంతాల్లో దళిత సంఘాలు నిరసనలు చేపట్టి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.రాజన్న సిరిసిల్ల జిల్లా మోచి సంఘం అధ్యక్షుడు ఓటరికారి లక్ష్మీ రాజం మాట్లాడుతూ.. బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశ బహిష్కరణతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే కఠిన శిక్ష విధించాలని ఆయన అన్నారు.అంబేద్కర్‌పై వ్యాఖ్యల వెనుక ఎవరున్నా వారిని కూడా వదిలిపెట్టబోమని లక్ష్మీ రాజం హెచ్చరించారు. ఈ సందర్భంగా బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో చంద్రగిరి భాస్కర్తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని అంబేద్కర్‌కు తమ సంఘీభావాన్ని ప్రకటించారు.అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదులు, నిరసనలు కొనసాగుతున్నాయి.'బాబాసాహెబ్ అంబేద్కర్ గౌరవం, భారత రాజ్యాంగ గౌరవం విషయంలో రాజీ ఉండదు" అంటూ నాయకులు స్పష్టం చేశారు.

## సీనియారిటీకి విలువ లేదా.. ప్రతి పోస్టుకు ఓ రేటా?

మొదటి పేజీ తరువాయి

అయితే ఎలాంటి బాధ్యతలు పట్టించుకోకుండా "అందిన కాడికి తీసుకోవడమే" అన్నట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిపై అధి కారిక నిర్ధారణ లేకపోవడంతో నిజానిజాలు తేలాల్సి ఉంది.

**వాస్తవాలు వెల్లడించాలి**

సీనియర్లను కాదని జూనియర్లకు బాధ్యతలు అప్పగించడానికి కారణమేంటి..? ఎంపికలో అనుసరించిన ప్రమాణాలేమిటి..? అన్న విషయాలను బల్దియా కమిషనర్ పరిశీలించి స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

## మృతుల కుటుంబాలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**హసన్‌పర్తి, సెప్టెంబర్ 20 (జై భీమ్ న్యూస్)**



మృతుల కుటుంబాలకు అండగా ఉంటానని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. హసన్‌పర్తి మండలంలోని మడిపల్లి, సీతంపేట గ్రామాలతో పాటు 65వ డివిజన్‌లో పలు కుటుంబాలను ఆదివారం ఆయన పరామర్శించారు. హసన్‌పర్తి మండలం మడిపల్లి గ్రామానికి చెందిన ముంజ బాలరాజు మృతి చెందడంతో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా సీతంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ మద్దునూరి చేరాలు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. గ్రామ అభివృద్ధి కోసం మాజీ సర్పంచ్‌గా చేరాలు అందించిన సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్మరించుకున్నారు. ఆయన మృతి గ్రామానికి, ప్రజలకు తీరని లోటని పేర్కొంటూ, ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పుట్ట రవి తల్లి పుట్ట రాజమ్మ ఇటీవల మృతి చెందడంతో 65వ డివిజన్ సుబ్బయ్యపల్లి గ్రామంలోని వారి నివాసానికి ఎమ్మెల్యే వెళ్లారు. రాజమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజమ్మ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దళితుల అంగుళం భూమిని కూడా ప్రభుత్వం తీసుకోదు

- దళిత, గిరిజనుల భూములకు సంపూర్ణ రక్షణ : మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**హైద్రాబాద్, సెప్టెంబర్ 20 (జై భీమ్ న్యూస్)**

దళితులు, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజా ప్రభుత్వ విధానం కాదని, వారి అంగుళం భూమిని కూడా ప్రభుత్వం తీసుకోదని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం దళితుల భూములకు సంపూర్ణ రక్షణగా నిలుస్తుందని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో రెండున్నర సంవత్సరాల క్రితం దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల ప్రజల ఆశీస్సులతో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, సామాజిక న్యాయం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ పాలనలో ప్రధాన ప్రాధాన్యతలుగా ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. దేశంలో, రాష్ట్రంలో పేదలు, దళితులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని ఆయన తెలిపారు. భూ సంస్కరణలు, భూ పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా భూమిలేని దళితులకు భూములు ఇచ్చి హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఉందన్నారు. తెలంగాణ ప్రాంతంలో ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో దళితులకు సుమారు 25 లక్షల ఎకరాల భూముల పంపిణీ, పోడు భూముల విషయంలో గిరిజనులకు సుమారు 2 లక్షల ఎకరాలపై హక్కులు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. భూమిలేని వారికి భూమి, హక్కులు లేని వారికి హక్కులు కల్పించడమే కాంగ్రెస్ విధానమని, దళిత, గిరిజనుల భూ హక్కులను కాపాడుతూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. రెవెన్యూ శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరఫున దళిత కుటుంబాలకు స్పష్టమైన హామీ ఇస్తున్నానని, వారి అంగుళం భూమిని కూడా ప్రభుత్వం లాక్కోదని, భూములు తీసుకునే ఆలోచన ప్రభుత్వానికి లేదని తెలిపారు. భూములకు సంబంధించిన రికార్డుల పరిశీలన, సర్వేలు, భూ సమస్యల పరిష్కార ప్రక్రియలను ప్రజల భూములను లాక్కోవడానికి చేస్తున్న చర్యలుగా చూడటం సరికాదన్నారు. భూములపై ప్రజలకు ఉన్న హక్కులను స్పష్టంగా నమోదు చేయడం, భూ వివాదాలను పరిష్కరించడం, భూ హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు. దళితుల భూముల విషయంలో కొంతమంది కావాలనే భయాందోళనలు సృష్టిస్తూ విష ప్రచారం చేస్తున్నారని, తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. వాస్తవాలను తెలుసుకోకుండా ఎలాంటి విషప్రచారాన్ని నమ్మవద్దని, దళితులను రెచ్చగొట్టి వారి భూముల పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూసే ప్రయత్నాలను ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్య చట్టబద్ధంగా, పారదర్శకంగా ఉంటుందని స్పష్టం చేశారు. రీ-సర్వే ద్వారా భూముల వాస్తవ పరిస్థితులను గుర్తించి దళితులు, గిరిజనులకు హక్కులు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల ప్రాంతంలోని 15 రెవెన్యూ గ్రామాలతో పాటు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ సమస్యలకు పరిష్కారం చూపించినట్లు పేర్కొన్నారు. భూమిపై హక్కులు కల్పించడం ద్వారా వారికి ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దళిత, గిరిజనులకు వారి భూములపై హక్కులను కల్పించి మరింత పటిష్టం చేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. దళిత కుటుంబాలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని ఆయన మరోసారి భరోసా ఇచ్చారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**హన్మకొండ, 20 సెప్టెంబర్ 2026(జై భీమ్ న్యూస్)**

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. హనుమకొండ భవానీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల మహిళా డెయిరీ అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై అధికారులు, డెయిరీ సభ్యులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరకాల మహిళా డెయిరీని మరింత బలోపేతం చేసేందుకు రూపొందించిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. పాల సేకరణను పెంచడం, పాడి పశువుల నాణ్యతను మెరుగుపరచడం, మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం, పశువుల దాణా, పచ్చిమేతను అందుబాటులోకి తీసుకురావడం, కృత్రిమ గర్భధారణను ప్రోత్సహించడం, మహిళా రైతులకు శిక్షణ అందించడం వంటి అంశాలపై ప్రభుత్వం అందిస్తున్న సహకారం, నిధుల వివరాలను ఎమ్మెల్యే వెల్లడించారు. పరకాల మహిళా డెయిరీ అభివృద్ధిలో కీలక ముందడుగుగా జాతీయ పాల అభివృద్ధి మండలి(ఎన్.డి.డి.బి)తో ఐదేళ్ల భాగస్వామ్యానికి అవగాహన ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఈ భాగస్వామ్యంతో డెయిరీ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించి, పాల ఉత్పత్తిదారులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పాడి రైతులకు వారి శ్రమకు తగిన న్యాయమైన ధర లభించేలా చూడాలని, పాల ఉత్పత్తిదారులు మధ్యవర్తులపై ఆధారపడాల్సిన పరిస్థితి లేకుండా మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. మహిళా రైతుల ఆదాయాన్ని పెంచే విధంగా డెయిరీ కార్యకలాపాలను విస్తరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సహకారం, అధికారుల కృషితో రాజకీయాలకు అతీతంగా పరకాల మహిళా డెయిరీని అభివృద్ధి చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని రేవూరి ప్రకాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు.

## పోటీ పరీక్షలకు మాక్ టెస్టులు

# ఎంతో ఉపయోగకరం

- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీస్ సెంటర్
- విష్ణు ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా మాక్ టెస్ట్

**హన్మకొండ, 20 సెప్టెంబర్, జై భీమ్ న్యూస్:** పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల్లో పరీక్షల పట్ల అవగాహన, ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు వారి సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు మాక్ టెస్టులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఓయూ ప్రొఫెసర్ వెంకట్ రామ్ రెడ్డి అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీస్ సెంటర్, విష్ణు ఐఏఎస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ టెస్ట్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓయూ ప్రొఫెసర్ వెంకట్ రామ్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, విష్ణు ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ పి. విష్ణు వర్ధన్ గౌడ్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పుల్లా శ్రీనివాస్ కలిసి మాక్ టెస్ట్ ప్రశ్నపత్రాన్ని అధికారికంగా విడుదల చేశారు. అనంతరం విద్యార్థులు మాక్ టెస్ట్‌కు హాజరై పరీక్ష రాశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకట్ రామ్ రెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలను చదవడంతో పాటు తరచూ మాక్ టెస్టులు రాయడం ద్వారా తమ ప్రిపరేషన్ స్థాయిని తెలుసుకోవచ్చని తెలిపారు. మాక్ టెస్టుల ద్వారా ప్రశ్నలను నిర్ణీత సమయంలో ఎలా పూర్తి చేయాలి, ఏ అంశాల్లో మరింతగా సాధన చేయాలి, పరీక్షా విధానం ఎలా ఉంటుంది అనే విషయాలపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు పూర్తి ఏకాగ్రత, పట్టుదల, నిరంతర సాధనతో ముందుకు సాగితే పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని సూచించారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తనలోని అంతర్గత ప్రతిభను గుర్తించి, స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని అన్నారు. లక్ష్యాన్ని సాధించేందుకు క్రమశిక్షణ, నిరంతర సాధన ఎంతో అవసరమని తెలిపారు. పోటీ పరీక్షల్లో విజయానికి ఒక్కరోజు లేదా కొద్దికాలం చదువు సరిపోదని, నిరంతరం నేర్చుకుంటూ, తమ లోపాలను సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. విష్ణు ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ పి. విష్ణు వర్ధన్ గౌడ్ మాటాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి సరైన మార్గదర్శకత్వం అందించి అన్ని రంగాల్లో ప్రోత్సహించడమే తమ అకాడమీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతిభ ఉన్నప్పటికీ సరైన మార్గదర్శకత్వం, శిక్షణ అందక అనేక మంది విద్యార్థులు పోటీ పరీక్షల్లో వెనుకబడుతున్నారని, అలాంటి విద్యార్థులకు అవసరమైన సహకారం అందించేందుకు అకాడమీ కృషి చేస్తుందని చెప్పారు. విద్యార్థుల సౌకర్యార్థం మాక్ టెస్టులతో పాటు ఆన్‌లైన్ తరగతులను కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు విష్ణు వర్ధన్ గౌడ్ వెల్లడించారు. పోటీ పరీక్షలకు అవసరమైన అంశాలపై నాణ్యమైన శిక్షణ, పరీక్షా విధానంపై అవగాహన, నిరంతర ప్రాక్టీస్ కల్పించేందుకు కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. మాక్ టెస్ట్ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పరీక్ష రాశారు. కార్యక్రమంలో పి. భాస్కర్, బి. రాజు, డి. ఆనందం, వై. బాబు, ఎస్. రాజమౌళి, రాజమహేంద్రతో పాటు పలువురు అధ్యాపకులు, అకాడమీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పిస్తూ, వారి సన్నద్ధతను పరీక్షించేందుకు నిర్వహించిన ఈ మాక్ టెస్ట్ కార్యక్రమం విజయ






## తెలంగాణ జర్నలిస్టుల జేఏసీకి నూతన జిల్లా అధ్యక్షుల నియామకం

- తొమ్మిది జిల్లాలకు అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ
- జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని సూచన

**హైద్రాబాద్, సెప్టెంబర్ 20 (జై భీమ్ న్యూస్)** తెలంగాణ జర్నలిస్టుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేజేఏసీ)ను రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేసే దిశగా తొమ్మిది జిల్లాలకు నూతన జిల్లా అధ్యక్షులను నియమించారు. టీజేజేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తొగరి కరుణాకర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల గణేష్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.


తెలంగాణ జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ
TJJAC
TELANGANA JOURNALIST JOINT ACTION COMMITTEE
జర్నలిస్టుల ఐక్యత.. సమాజ సేవలో...
PRESS | MEDIA | SOCIETY | SERVICE
నియామక పత్రం
తెలంగాణ జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)నందు వీరిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయనైనది. జేఏసీ నియమనిబంధనలు ఉల్లంఘించిన వారిని పదవి నుండి తొలగించబడును.
1).కందాటి శ్రీనివాసరావు- జిల్లా అధ్యక్షులు- సూర్యాపేట
2).విస్లావత్ దశరథ- జిల్లా అధ్యక్షులు- మహబూబ్ నగర్
3).జి. రవి- జిల్లా అధ్యక్షులు- వనపర్తి
4).గుగులోతు బావు సింగ్- జిల్లా అధ్యక్షులు- ఖమ్మం
5).బానోతు రవీంద్రనాథ్-జిల్లా అధ్యక్షులు- భద్రాద్రి కొత్తగూడెం
6).వల్లి ప్రశాంత్- జిల్లా అధ్యక్షులు- వరంగల్
7).రెడ్డిమళ్ల సత్యం- జిల్లా అధ్యక్షులు- కరీంనగర్
8).చింతపండు నర్సయ్య- జిల్లా అధ్యక్షులు- నిర్మల్
9).అబ్బా కరుణాకర్- జిల్లా అధ్యక్షులు- నాగర్ కర్నూల్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
తేదీ: 20-09-2026
రాష్ట్ర అధ్యక్షులు

నూతనంగా నియమితులైన జిల్లా అధ్యక్షులు తమ తమ జిల్లాల్లో జేఏసీ కార్యకలాపాలను సమన్వయం చేస్తూ జర్నలిస్టుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర నాయకత్వం సూచించింది. టీజేజేఏసీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన సమస్యలపై కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు జిల్లా స్థాయిలో సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేస్తున్నట్లు నాయకత్వం పేర్కొంది. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లా అధ్యక్షులుగా కందాటి శ్రీనివాసరావు, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులుగా ఎల్లపాటి దశరథ, వనపర్తి జిల్లా అధ్యక్షులుగా జి. రవి, ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా గుగులోతు బాబు సింగ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులుగా బానోతు రవీంద్రనాథ్, వరంగల్ జిల్లా అధ్యక్షులుగా వల్లి ప్రశాంత్, కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా రెడ్డిమల్ల సత్యం, నిర్మల్ జిల్లా అధ్యక్షులుగా చింతపండు నరయ్య, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులుగా అబ్బా కరుణాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు జారీ చేసిన నియామక ఉత్తర్వుల్లో నూతన జిల్లా అధ్యక్షులు సెప్టెంబర్ 20, 2026 నుంచి తమ హోదాలో అధికారిక బాధ్యతలు చేపట్టాలని సూచించారు. జేఏసీ రూపొందించిన నియమ నిబంధనలను పాటిస్తూ, సంస్థాగత క్రమశిక్షణకు ప్రాధాన్యత నిస్తూ బాధ్యతలను నిర్వర్తించాలని కోరారు. రాష్ట్ర నాయకత్వం నుంచి తదుపరి ఆదేశాలు అందిన వెంటనే వాటిని జిల్లాస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ సంబంధిత కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన వారు తమ పరిధిలోని జర్నలిస్టులతో సమన్వయం చేసుకుని వారి సమస్యలు, అవసరాలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు జేఏసీ కార్యక్రమాల్లో జర్నలిస్టుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. జిల్లాల వారీగా సంస్థను బలోపేతం చేయడం ద్వారా జర్నలిస్టులకు సంబంధించిన అంశాలపై సమిష్టిగా స్పందించేందుకు అవకాశం ఏర్పడుతుందని నాయకత్వం తెలిపింది. నూతన జిల్లా అధ్యక్షుల నియామకంపై టీజేజేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుంగ చాందిని అభినందనలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు తొగరి కరుణాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల గణేష్ ఆదేశాలు, సూచనలకు అనుగుణంగా నూతన జిల్లా అధ్యక్షులు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆమె ఆకాంక్షించారు. జేఏసీ నియమ నిబంధనలకు కట్టుబడి క్రమశిక్షణతో ముందుకు సాగుతూ, జర్నలిస్టుల సమస్యలను రాష్ట్ర స్థాయి నాయకత్వంతో సమన్వయం చేసుకుని పరిష్కార దిశగా కృషి చేయాలని కోరారు. నూతనంగా నియమితులైన జిల్లా అధ్యక్షులకు టీజేజేఏసీ నాయకులు, జర్నలిస్టులు అభినందనలు తెలియజేస్తూ, ఆయా జిల్లాల్లో జేఏసీ కార్యకలాపాలను విస్తృతం చేసి జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు.



## కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్య పరీక్షలకు సర్వం సిద్ధం

- 21 నుంచి యూజీ, పీజీ పరీక్షలు.. 16,152 మంది విద్యార్థులు హాజరు

**హన్మకొండ, సెప్టెంబర్ 20 (జై భీమ్ న్యూస్)** కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి సంబంధించిన వివిధ కోర్సుల పరీక్షలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ విషయాన్ని విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్ల, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పద్మజ సంయుక్త ప్రకటనలో తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం ఆధ్వర్యంలో యూజీ మొదటి, రెండో, మూడో సంవత్సరాల పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలను మొత్తం 15 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్నారు. పరీక్షల పర్య వేక్షణ కోసం 15 మంది పరిశీలకులను నియమించారు. ఈ పరీక్షలకు మొత్తం 6,621 మంది విద్యార్థులు హాజరుకానున్నా రు. అదే విధంగా యూజీ రెండో, మూడో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలను 10 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతి పరీక్షా కేం ద్రంలో పరీక్షల నిర్వహణను పర్యవే క్షించేందుకు 10 మంది పరిశీలకులను నియమించారు. ఈ పరీక్షలకు మొత్తం 3,757 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. కాగా, దూర విద్యా కేంద్రం ఆధ్వర్యంలో పీజీ రెండో, మూడో సెమిస్టర్ పరీక్షలు కూడా ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. పీజీ పరీక్షలను 15 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్నారు. పరీక్షల పర్యవేక్షణ కోసం 15 మంది పరిశీల కులను నియమించగా, మొత్తం 5,494 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇక దూర విద్యా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే మార్గదర్శకత్వం,కౌన్సెలింగ్‌లో డిప్లొమా, కంప్యూటర్ అప్లికేష న్స్‌లో డిప్లొమా పరీక్షలను కూడా నిర్వహించనున్న ట్లు అధికారులు తెలిపారు. ఈ పరీక్షలకు ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఒక పరిశీలకుడిని నియమించారు. ఈ పరీక్షలకు మొత్తం 280 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వివిధ కోర్సులకు సంబంధి ంచి నిర్వహించనున్న పరీక్షలకు మొత్తం 16,152 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు అధికారులు వెల్ల డించారు. విద్యార్థులు పరీక్షలకు ముందుగానే పరీక్షా కేంద్రాలను తెలుసుకొని, నిర్ణీత సమయానికి కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బంది లు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పరీక్షలకు సంబంధించిన పూర్తి వివరాలు, పరీక్షా కేంద్రాలు, సమయాలు, ఇతర సూచనలను కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించ వచ్చని పరీ క్షల నియంత్రణాధికారులు తెలిపారు.

## పోలీస్ పోటీ పరీక్షలకు భారీ స్పందన






- స్క్రీనింగ్ టెస్ట్‌కు 368 మంది హాజరు.. మరో పరీక్షకు 975 మంది అభ్యర్థులు

**వరంగల్, సెప్టెంబర్ 20 (జై భీమ్ క్రైమ్ న్యూస్)** పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు నిర్వహించిన పోటీ పరీక్షలు, స్క్రీనింగ్ టెస్టులకు భారీ స్పందన లభించింది. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. కేయూ పోలీస్ స్టేషన్ (కేయూసీ) పరిధిలో నిర్వహించిన పోలీస్ పోటీ పరీక్షల స్క్రీనింగ్ టెస్ట్‌కు మొత్తం 794 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 368 మంది పరీక్షకు హాజరయ్యారు. హాజరైన వారిలో 270 మంది పురుషులు, 98 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. మొత్తం రిజిస్ట్రేషన్లతో పోలిస్తే సుమారు 46 శాతం మంది స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, మరో పోలీస్ పోటీ పరీక్షకు సంబంధించి ఆన్‌లైన్‌లో మొత్తం 1,966 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 975 మంది పరీక్షకు హాజరయ్యారు. దరఖాస్తుదారులతో పోలిస్తే సుమారు 50 శాతం మంది పరీక్షకు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షల నిర్వహణ సందర్భంగా అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా చర్యలు, అభ్యర్థుల హాజరు నమోదు, పరీక్షా నియమావళి అమలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు సిబ్బంది, పరీక్షా నిర్వాహకులు సమన్వయంతో పనిచేశారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు పరీక్షా కేంద్రాల్లో అవసరమైన భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. అభ్యర్థులు పరీక్షా నిబంధనలను పాటిస్తూ క్రమశిక్షణతో పరీక్షలకు హాజరయ్యారు. పోలీస్ శాఖలో ఉద్యోగాల కోసం పోటీ పడుతున్న అభ్యర్థులకు ఇటువంటి స్క్రీనింగ్ టెస్టులు, పోటీ పరీక్షలు తమ సన్నద్ధతను అంచనా వేసుకోవడానికి, పరీక్షా విధానంపై అవగాహన పెంచుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావడంతో పోలీస్ ఉద్యోగాల పట్ల యువతలో ఉన్న ఆసక్తి స్పష్టమవుతోంది.

## శ్రీసాయి నగర్‌లో వైభవంగా గణపతి నవరాత్రి వేడుకలు

- 23 జంటలతో మహా హోమం.. భక్తులకు ఘనంగా అన్నప్రసాద వితరణ

**హన్మకొండ, సెప్టెంబర్ 20 (జై భీమ్ న్యూస్)** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్ శ్రీసాయి నగర్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఏడో రోజు గణనాథుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను రఘునందన్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సవ ప్రాంగణానికి చేరుకుని గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, భక్తుల గణపతి నామస్మరణలతో శ్రీసాయి నగర్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆకునూరి మహేందర్ హాజరై గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ముత్తినేని రాజేశ్వరరావు––రజిత దంపతుల ఆధ్వర్యంలో 23 జంటలతో మహా హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య హోమ కార్యక్రమం కొనసాగగా, పాల్గొన్న దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథుడి ఆశీస్సులు పొందారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రాంతం అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహా హోమం అనంతరం ప్రభాకర్ గౌడ్–లావణ్య దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదాన్ని అందించారు. శ్రీసాయి నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి గణనాథుడిని దర్శించుకుని పూజల్లో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తున్నారు. ఉత్సవాల నిర్వహణలో స్థానికులు, నిర్వాహకులు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తంగేళ్లపల్లి సాంబమూర్తి, వలబోజు ఉపేందర్‌రావు, చిర్ర తిరుపతి, లింగయ్య, మల్లాడి జ్ఞానేందర్‌రెడ్డి, వీరారెడ్డి, రాజారెడ్డి, మలహర్‌రావు, శోభ, అన్నపూర్ణ, తరంగిణి తదితరులు పాల్గొన్నారు. దీంతో శ్రీసాయి నగర్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తుల సందడి, ఆధ్యాత్మిక శోభ మధ్య కొనసాగుతున్నాయి.






## నేడు ప్రజావాణి.. ప్రజల నుంచి వినతుల స్వీకరణ



**హన్మకొండ, సెప్టెంబర్ 20 (జై భీమ్ న్యూస్)** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సోమవారం హనుమకొండ జిల్లాలో నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు, అర్జీలను స్వీకరించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అదేవిధంగా హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలతో పాటు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాల్లో (ఎంపీడీవో) కూడా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సంబంధిత కార్యాలయాల్లో సమర్పించవచ్చని, ప్రజల నుంచి స్వీకరించిన వినతులను పరిశీలించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలు, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చాహత్ బాజ్ పాయి కోరారు.




## హనుమకొండ జిల్లాలో 55 అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీ

**- సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ**

హన్మకొండ, సెప్టెంబర్ 20 (జై భీమ్ న్యూస్)

హనుమకొండ జిల్లాలోని మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. మొత్తం 55 అంగన్‌వాడీ టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భీమదేవరపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 23 పోస్టులు, హనుమకొండ ప్రాజెక్టు పరిధిలో 19 పోస్టులు, పరకాల ప్రాజెక్టు పరిధిలో 13 పోస్టులు ఉన్నాయని వెల్లడించారు. దరఖాస్తుల ప్రక్రియ 2026 సెప్టెంబర్ 22న ప్రారంభమై అక్టోబర్ 6వ తేదీ సాయంత్రం 5 గంటలకు ముగియనుంది. అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే మహిళా అభ్యర్థులు ఇంటర్మీడియట్ లేదా 12వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 2026 జూలై 1 నాటికి 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని అధికారులు తెలిపారు. అభ్యర్థులు సంబంధిత అంగన్‌వాడీ కేంద్రం ఉన్న గ్రామం లేదా పట్టణ ప్రాంతంలోని సంబంధిత వార్డు/ డివిజన్‌కు చెందిన స్థానిక మహిళలై ఉండాలని పేర్కొన్నారు. రిజర్వేషన్ కేటగిరీలకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలు, స్థానికత నిబంధనలు వర్తిస్తాయని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక 100 మార్కుల ప్రాతిపదికన నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇంటర్మీడియట్ లేదా 12వ తరగతి మార్కులకు 70 మార్కులు, ప్రత్యేక కేటగిరీలకు సంబంధించిన వెయిటేజీగా వితంతువులకు 5 మార్కులు, అనాథలకు 10 మార్కులు, దివ్యాంగులకు 5 మార్కులు, ఇంటర్వ్యూకు 10 మార్కులు కేటాయించినట్లు తెలిపారు. ఎంపిక ప్రక్రియలో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, రిజర్వేషన్ నిబంధనలను పాటించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్, విద్యార్హత ధ్రువపత్రాలు, నివాస ధ్రువపత్రం, కుల ధ్రువపత్రం, దివ్యాంగులైతే సంబంధిత సర్టిఫికెట్, వితంతువులైతే భర్త మరణ ధ్రువపత్రం, అనాథలకు సంబంధించిన ధ్రువపత్రాలు తదితర అవసరమైన పత్రాల స్కాన్ కాపీలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు సంబంధిత గ్రామం/వార్డు పరిధిలోనే విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. పోస్టుల భర్తీకి సంబంధించిన పూర్తి నోటిఫికేషన్, అర్హతలు, ఖాళీల వివరాలు, దరఖాస్తు విధానం తదితర సమాచారాన్ని https: wdcw.tg.nic.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని అధికారులు సూచించారు. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను స్వీకరించబోమని, ఆసక్తి మరియు అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## కాజీపేటలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాజీపేట, సెప్టెంబర్ 20 (జై భీమ్ క్రైమ్ న్యూస్)



కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కడిపికొండ బాపూజీనగర్ చౌరస్తా సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 60 నుంచి 80 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని స్థానికుడు కొలువుల లక్ష్మయ్య గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు తెల్లని షర్ట్, తెల్లని పంచె ధరించి ఉండగా, తెల్లని గడ్డం కలిగి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సరైన ఆహారం, నీరు అందక మృతి చెంది ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనపై కాజీపేట పోలీసులు క్రైమ్.నం.267/2026, బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 194 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలిసిన వారు కాజీపేట పోలీసులను సంప్రదించాలని కోరారు.

## మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం

రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 20 (జై భీమ్ న్యూస్)




కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, మానవ వనరుల శాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబును కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండ బాబు మంత్రి నారా లోకేష్‌తో కొద్దిసేపు మాట్లాడారు. కాకినాడ జిల్లా పర్యటనకు సంబంధించిన కార్యక్రమాలపై ఇరువురు నేతలు పరస్పరం చర్చించినట్లు తెలిపారు. మంత్రి పర్యటన సందర్భంగా విమానాశ్రయం వద్ద నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు.

# ఎదుగుదలను ఎదురించకండి.. ప్రోత్సహించండి

**- ఇతరుల విజయాన్ని చూసి ఈర్ష్యపడకుండా అభినందించాలి..**
**సాటి మనిషిని ప్రేమించి అండగా నిలవాలి**
**- మనం మారితేనే లోకం మారుతుంది :**
**సామాజిక శాస్త్రవేత్త, కవి, రచయిత డా. మేడపాటి ఇమ్మానుయేల్**

అమరావతి, సెప్టెంబర్ 20 (జై భీమ్ న్యూస్)

మన చుట్టూ ఉన్న వ్యక్తులు జీవితంలో ఎదుగుతున్నప్పుడు వారిని అడ్డుకోవడం, విమర్శించడం, ఈర్ష్యపడటం కాకుండా వారి విజయాన్ని అభినందించి ప్రోత్సహించాలని సామాజిక శాస్త్రవేత్త, కవి, రచయిత డా. మేడపాటి ఇమ్మానుయేల్ అన్నారు. "ఎదురించకు ఎదుగుదలను.. అభినందించాలి గాని అదిరిపడటమెందుకు? ఆహ్వానించ గలిగినప్పుడు ఆయాసపడట మెందుకు?" అని ఆయన పేర్కొన్నారు. నూతన ఆలోచనలు, సృజనాత్మకత, ఇన్నోవేషన్స్‌తో ముందుకు వస్తున్న వారిని ప్రోత్సహించడం ద్వారా సమాజంలో అభివృద్ధికి మార్గం సుగమమవుతుందని తెలిపారు. ఇతరులు సాధిస్తున్న విజయాలను చూసి ఈర్ష్యతో రగిలిపోవడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, అది మనశ్శాంతితో పాటు ఆరోగ్యానికి కూడా చేటు చేస్తుందని అన్నారు. ఎవరో ఒకరు కొత్తగా ఆలోచించి ముందుకు వెళ్తున్నప్పుడు వారి లోపాలను వెతకడం కాకుండా, వారి ప్రయత్నంలోని మంచిని గుర్తించి కాంప్లిమెంట్ ఇవ్వాలని సూచించారు. జీవితంలో సమస్యలకు పరిష్కార మార్గాలు చూపించే వ్యక్తిని శత్రువుగా భావించకూడదని, ఉపాయాలు చెప్పేవాడు ఉపకారి తప్ప అపకారి కాదని స్పష్టం చేశారు. మన తప్పులను ఎత్తిచూపి సరిదిద్దే వ్యక్తుల మాటలను కూడా ఓర్పుతో వినాలని, అనుభవజ్ఞులు చెప్పే పాఠాలను తలకెక్కించుకుని ఆచరణలో పెట్టాలని సూచించారు. ఊరంతా బంధువులు ఉన్నంత మాత్రాన సరిపోదని, అవసరమైన సమయంలో మనకు అండగా నిలిచి సహాయం చేసే వ్యక్తి ఉండటం ఎంతో ముఖ్యమని అన్నారు. ఆపదలో తోడుగా నిలిచేవారే నిజమైన ఆత్మీయులని, బంధుత్వం కేవలం మాటలకే పరిమితం కాకుండా కష్టసమయంలో చేతులు కలిపే మానవత్వంగా మారాలని ఆకాంక్షించారు. మన జీవితంలో ఎవరు ఏ సమయంలో చేసిన సహాయాన్ని మరచిపోకూడదని, చేసిన మేలుకు కృతజ్ఞతలు తెలియజేయడంలో కాలయాపన చేయకూడదని డా. ఇమ్మానుయేల్ అన్నారు. "ఎందరో మహానుభావుల వెనుక మొదటగా తల్లిదండ్రులు, స్నేహితులు, గురువుల ప్రోత్సాహం ఉంటుంది" అని పేర్కొంటూ, ఒక వ్యక్తి ఎదుగుదలలో కుటుంబ సభ్యులు, స్నేహితులు అందించే ప్రోత్సాహం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రతి మనిషికి దేవుడు ఏదో ఒక ప్రత్యేకతను, లక్ష్యాన్ని ఇచ్చాడని, అందువల్ల ఎదుగుతున్న వ్యక్తిని అడ్డుకోవడం కాకుండా అతని సామర్థ్యానికి అనుగుణంగా ముందుకు వెళ్లేందుకు సహకరించాలని అన్నారు. చదువుకుంటే సరిపోదని, ఉద్యోగం వస్తేనే జీవితం పరిపూర్ణమైనట్లు భావించకూడదని సూచించారు. మన వ్యక్తిగత విజయంతో పాటు సమాజానికి తాము చేస్తున్న మేలు ఏమిటో కూడా ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. "నేను ఒక్కరినైనా ప్రోత్సహిస్తున్నానా? ఒక్కరి జీవితంలోనైనా సానుకూల మార్పుకు కారణమవుతున్నానా?" అనే ప్రశ్నను ప్రతి ఒక్కరూ తమను తాము వేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం మనుషుల మధ్య సంబంధాలు ఉన్నప్పటికీ పరస్పర ప్రేమ, ఆప్యాయత, సహకారం తగ్గిపోతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని అన్నారు. "ఓడిపోతున్నాం.. సాటి మనిషిని ప్రేమించడంలో ఓడిపోతున్నాం" అని పేర్కొంటూ, మనిషి జీవితంలో సంపద, హోదా, చదువు, ఉద్యోగం మాత్రమే కాకుండా మానవత్వం, ప్రేమ, సహకారం కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు. ఇతరుల విజయాన్ని చూసి అసూయపడకుండా, వారి నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు. ఒకరి ఎదుగుదల మరో వ్యక్తికి కూడా ప్రేరణగా మారినప్పుడే సమాజంలో ఆరోగ్యకరమైన పోటీ, సానుకూల వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. "అందరూ సమానమే.. అంతా స్వార్థమే" అనే ప్రతికూల ఆలోచనను విడిచిపెట్టి, ప్రతి మనిషిలోని మంచితనాన్ని గుర్తించాలని సూచించారు. ఇతరులను మార్చాలని ప్రయత్నించే ముందు మనలో మనం మార్పు తెచ్చుకోవాలని, మన ఆలోచనలు, మాటలు, ప్రవర్తనలో సానుకూలత పెంచుకోవాలని డా. మేడపాటి ఇమ్మానుయేల్ అన్నారు. "మనం మారితే లోకం మారుతుంది" అనే భావనతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని, ఎదుగుతున్న వారిని వెనక్కి లాగకుండా చేయూతనిస్తూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. సమాజంలో పరస్పర గౌరవం, ప్రేమ, సహకారం, కృతజ్ఞత, ప్రోత్సాహం పెరిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.



సామాజిక శాస్త్రవేత్త, కవి, రచయిత, డా. మేడపాటి ఇమ్మానుయేల్.

## పోటీ పరీక్షలకు మాక్ టెస్ట్‌లు ఎంతో దోహదం

**- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీస్ సెంటర్, విష్ణు ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా మాక్ టెస్ట్**

హన్మకొండ, 20 సెప్టెంబర్ 2026(జై భీమ్ న్యూస్)

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు పరీక్షల పట్ల అవగాహన కల్పించేందుకు నిర్వహించే మాక్ టెస్ట్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఓఎస్డీ ప్రొఫెసర్ వెంకట్ రామ్ రెడ్డి అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీస్ సెంటర్, విష్ణు ఐఏఎస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ టెస్ట్ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఓఎస్డీ ప్రొఫెసర్ వెంకట్ రామ్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, విష్ణు ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ పి. విష్ణు వర్ధన్ గౌడ్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పుల్లా శ్రీనివాస్ హాజరై మాక్ టెస్ట్ ఎగ్జామ్ పేపర్‌ను అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకట్ రామ్ రెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే ప్రతి విద్యార్థికి మాక్ టెస్ట్‌లు ఎంతో సహాయపడతాయని తెలిపారు. విద్యార్థులు పూర్తి ఏకాగ్రత, పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా చదివితే కచ్చితంగా విజయాన్ని సాధించవచ్చని సూచించారు. ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు తమలోని అంతర్గత ప్రతిభను గుర్తించి, దానిని సరైన దిశలో వినియోగించుకుంటూ ప్రణాళికాబద్ధంగా శ్రమించాలని, తద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విష్ణు ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ పి. విష్ణు వర్ధన్ గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించడమే తమ అకాడమీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం మాక్ టెస్ట్‌లతో పాటు ఆన్‌లైన్ క్లాసులను కూడా అందుబాటులో ఉంచామని వెల్లడించారు. కార్యక్రమంలో పి. భాస్కర్, బీ. రాజు, డి. ఆనందం, వై. బాబు, ఎస్. రాజమౌళి, రాజమహేంద్రతో పాటు పలువురు అధ్యాపకులు, అకాడమీ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.




## వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కింద పడి గుర్తుతెలియని మహిళ మృతి

**- ఘన్పూర్--నస్కల్ రైల్వే స్టేషన్ల మధ్య విషాద ఘటన.. కాజీపేట రైల్వే పోలీసుల దర్యాప్తు**

కాజీపేట, 20 సెప్టెంబర్ (జై భీమ్ క్రైమ్ న్యూస్)

ఘన్పూర్-నస్కల్ రైల్వే స్టేషన్ల మధ్య కిలోమీటర్ నంబర్ 306/26-27 వద్ద వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కింద పడి గుర్తుతెలియని మహిళ మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. రైలు నంబర్ 20833 వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కింద పడి మహిళ మృతి చెందినట్లు కాజీపేట రైల్వే పోలీసులు తెలిపారు. మృతురాలి వయస్సు సుమారు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. రైలు ప్రమాదం కారణంగా ఆమె ముఖం, తలకు తీవ్ర గాయాలు కావడంతో పాటు కాళ్లు, చేతులు విరిగిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నట్లు తెలిపారు. మృతురాలి వద్ద తెలుపు రంగు చున్నీ, బ్లూ కలర్ పెట్టీకోట్, బ్లూ కలర్ పైజామా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పైజామా చిరిగిపోయి ఉన్నట్లు తెలిపారు. ఘటన అనంతరం మృతదేహాన్ని వరంగల్‌లోని ఎంజీఎం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మృతురాలి పేరు, చిరునామా, కుటుంబ సభ్యుల వివరాలు, ఆచూకీ ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై కాజీపేట రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలిని గుర్తించేందుకు పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. మృతురాలి గురించి ఎవరికైనా సమాచారం తెలిసినట్లయితే కాజీపేట రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. రైల్వే ఎస్ఐ 8712658609, హెడ్ కానిస్టేబుల్ 8712576424 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలి

**- నిర్దేశించిన రూట్లలోనే విగ్రహాల ఊరేగింపు.. డీజేలకు అనుమతి లేదు**
**- హైటెన్షన్ వైర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ములుగు జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్**

ములుగు, సెప్టెంబర్ 20 (జై భీమ్ న్యూస్)



ములుగు జిల్లాలో గణేశ్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ ఐపీఎస్ తెలిపారు. నిమజ్జన కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల రాకపోకలు, గణేశ్ విగ్రహాల ఊరేగింపులపై ప్రత్యేక దృష్టి సారించి పోలీస్ సిబ్బందిని మోహరించినట్లు వెల్లడించారు. గణేశ్ విగ్రహాల ఊరేగింపు సమయంలో పోలీసులు ముందుగా నిర్దేశించి అనుమతించిన రూట్లలోనే విగ్రహాలను తీసుకెళ్లాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రూట్ మార్చి ప్రమాదకర ప్రాంతాల వైపు వెళ్లవద్దని సూచించారు. ముఖ్యంగా ఊరేగింపు సమయంలో హైటెన్షన్ విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాలు, ఇతర ప్రమాదకర ప్రాంతాల వద్ద అప్రమత్తంగా ఉండాలని, విగ్రహాలు లేదా ఇతర వస్తువులు విద్యుత్ తీగలకు తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. గణేశ్ నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేసిన ఎస్పీ, మైక్‌ల వినియోగానికి సంబంధించి తప్పనిసరిగా పోలీసుల అనుమతి పొందాలని తెలిపారు. ఏటూరునాగారం పరిధిలోని వారు ఏటూరునాగారం ఏఎస్పీ వద్ద, ములుగు సబ్ డివిజన్ పరిధిలోని వారు ములుగు డీఎస్పీ వద్ద మైక్ అనుమతులు పొందవచ్చని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్‌లు వినియోగించరాదని, ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించవద్దని తెలిపారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనాలను నిర్దేశించిన మార్గాల్లోనే నడుపుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. ఊరేగింపు సమయంలో బాణాసంచా కాల్చరాదని సూచించారు. నిమజ్జనం జరిగే చెరువులు, వాగులు, కాలువలు, ఇతర నీటి వనరుల వద్ద ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ఈత రాని భక్తులు నీటిలోకి వెళ్లవద్దని సూచించారు. చిన్నారులను నిమజ్జన ప్రాంతాలకు తీసుకువచ్చే తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. గణేశ్ నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని ఎస్పీ తెలిపారు. జిల్లా ప్రజలు పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలు పాటిస్తూ గణేశ్ నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరి సహకారంతోనే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిమజ్జన వేడుకలను విజయవంతంగా నిర్వహించగలమని, ములుగు జిల్లా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ ఐపీఎస్ తెలిపారు.

## ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



**- ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

వరంగల్, సెప్టెంబర్ 20 (జై భీమ్ న్యూస్)

ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కోరారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజన్ స్థాయిలో రెవెన్యూ డివిజన్ అధికారులు, మండల స్థాయిలో మండల స్థాయి అధికారులు ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించే వినతులు, దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలను త్వరితగతిన చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతులను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కారం పొందే అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించే ఉద్దేశంతో జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయిల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని బాధ్యతతో పరిశీలించి, నిబంధనల ప్రకారం సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.